



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 267 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 1 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :267 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 1 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## గండిపేట భూ కుంభకోణం.. బొల్లా బ్రహ్మనాయుడే కీలక వ్యక్తి: డీసీపీ శ్రీనివాస్



- గండిపేటలో రూ.1500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు భారీ కుట్ర
- ఈ కుంభకోణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాత్రపై ఆధారాలు
- నకిలీ జీవోల తయారీకి రూ.4 కోట్లు చెల్లించినట్లు డీసీపీ శ్రీనివాస్ వెల్లడి
- ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని, గాలింపు కొనసాగుతోందని ప్రకటన

పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగు చూసిన భారీ భూ కుంభకోణం కేసులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. సుమారు రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు జరిగిన ఈ కుట్రలో కీలక వ్యక్తి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడేనని, అందుకు తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం నాడు విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలను ఆయన వెల్లడించారు. డీసీపీ శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కుంభకోణంలో

- మిగతా 2లో



## రొయ్యలకు మేత వేసి, పొలంలో దుక్కి దున్ని...

### సొంతూరులో మంత్రి నిమ్మల...

- ఆదివారం సొంతూరు అగర్తిపాలెంలో పర్యటించిన మంత్రి నిమ్మల రామానాయుడు
- సైకిల్‌పై ప్రయాణించి, తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి
- సొంత రొయ్యల చెరువులో మేత వేసి, రొయ్యల ఎదుగుదల పరిశీలన
- జలజీవన్ పైప్‌లైన్ పనుల విషయంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు
- ఈ వివరాలను మంత్రి తన సోషల్ మీడియా ఖాతాలో స్వయంగా పంచుకున్న వైనం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం తన సెలవు దినాన్ని వినూత్నంగా గడిపారు. రాజకీయాలతో నిత్యం బిజీగా ఉండే ఆయన, కాస్త విరామం దొరకడంతో తన సొంతూరులో రైతుగా మారిపోయారు. వ్యవసాయ పనుల్లో పాల్గొని, క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించారు. ఆదివారం తెల్లవారుజామున పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి సైకిల్‌పై బయలుదేరిన రామానాయుడు, 7 కిలోమీటర్ల దూరంలో

- మిగతా 2లో

### జూన్ 2 నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన...

# పెట్టుబడులే టార్గెట్

- రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మంత్రి లోకేష్ రష్యా పర్యటన
- జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో పర్యటించనున్న లోకేష్
- సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం
- పర్యటనలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్న మంత్రి



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటించనున్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు ఆయన రష్యాలో పర్యటించి, పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, వారిని ఏపీకి ఆహ్వానించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్' (స్పా×జుఖీ'26) సదస్సులో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు. ఈ పర్యటనలో భాగంగా, లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటీ, విద్య, ఇతర కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

### నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం..

## ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక

- నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై షర్మిల ఆగ్రహం
- ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపేనని ఆరోపణ
- పోలీసులు చూస్తూ ఉన్నా దాడిని ఆపలేదని విమర్శ
- విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరిక
- నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్

పెన్ పవర్ డెస్క్:నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు.


- మిగతా 2లో



## విశాఖ రైల్వే జోన్ నేటి నుంచే... సీఎం చంద్రబాబు ఏమన్నారంటే!

- జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం
- ఇది చారిత్రాత్మక మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- దశాబ్దాల కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి
- ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మోదీకి, రైల్వే మంత్రికి ధన్యవాదాలు
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ జోన్ కీలకం కానుందని వెల్లడి

- మిగతా 2లో






## వియత్నాం చేతికి 'బ్రహ్మోస్' అస్త్రం.. డీల్ ఖరారు చేసిన భారత్

- వియత్నాంకు బ్రహ్మోస్ క్షిపణుల అమ్మకంపై భారత్ ఒప్పందం పూర్తి
- ఇండోనేషియాతోనూ ఇదే తరహా ఒప్పందం తుది దశలో ఉందని వెల్లడి
- సింగపూర్‌లో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ కీలక ప్రకటన
- దక్షిణ చైనా సముద్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఒప్పందాలకు ప్రాధాన్యం
- రక్షణ ఎగుమతులను భారీగా పెంచుకోవడంపై భారత్ దృష్టి

పెన్ పవర్ డెస్క్:రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి 'బ్రహ్మోస్'ను వియత్నాంకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియాతో కూడా తుది దశలో ఉందని భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. సింగపూర్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక షాంగ్రీ-లా డైలాగ్ భద్రతా సదస్సులో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు."వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పందం ఇప్పటికే పూర్తయింది. బహుశా బహిరంగంగా ప్రకటించనప్పటికీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇండోనేషియాతో చర్చలు కూడా తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే ఒప్పందం ఖరారు కావచ్చు" అని రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు.

- మిగతా 2లో

## విశాఖ-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు..

### ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ కీలక ప్రకటన



- విశాఖపట్నం-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు వస్తుందన్న మాధవ్
- కేవలం గంటన్నరలోనే 350 కిలోమీటర్ల ప్రయాణం
- కేంద్ర మంత్రి చెప్పారని వెల్లడించిన ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్
- ప్రాజెక్టు సర్వే కోసం రైల్వే బోర్డుకు అధికారుల ప్రతిపాదన
- విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్

- మిగతా 2లో

## ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు

పెన్ పవర్ డెస్క్:ఉగ్రవాద పోషణలో పాక్ వంకర బుద్ధి మారడంలేదు. జమ్మూ కశ్మీర్‌లోని ఉగ్ర నెట్‌వర్క్‌ల కోసం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ నిబంధనల ఉల్లంఘనలకు కూడా పాల్పడుతోంది. ఇందుకోసం సరిహద్దుల వెంట భారత్ వైపు అక్రమంగా


- మిగతా 2లో



### ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు...

## అధికారికంగా ప్రకటించాలి

- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలన్న కవిత
- రైతు డిస్కం పేరుతో మిగతా డిస్కంలను ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఈ ప్రైవేటీకరణ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

- మిగతా 2లో

## ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ వెనకడుగు.. చర్చలంటూనే దాడి హెచ్చరికలు

- ఇరాన్‌తో ఒప్పందంపై ట్రంప్ అధ్యక్షతన భేటీ
- ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసిన సమావేశం
- అణ్వాయుధాన్ని వదులుకోవాలి, హర్మూజ్ జలసంధిని తెరవాలని యూఎస్ షరతులు
- ఒప్పందం విఫలమైతే దాడులకు సిద్ధమని ప్రకటించిన అమెరికా రక్షణ మంత్రి
- చర్చలపై నమ్మకం లేదని, క్షిపణులే తమ బలమని ఇరాన్ స్పష్టీకరణ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# టెన్షన్ మళ్లీ

ఇరాన్ నౌకాశ్రయాలపై అమలు చేస్తున్న దిగ్బంధనాన్ని ఛేదించేందుకు ప్రయత్నించిన ఓ వాణిజ్య నౌకపై అమెరికా సైన్యం క్షిపణి ప్రయోగించింది. నౌక ఇంజిన్ గదిని లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ శనివారం వెల్లడించింది. గాంబియా జెండాతో ప్రయాణిస్తున్న 'లియాన్ స్టార్' కార్గో నౌక ఇరాన్ నౌకాశ్రయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. దీనిపై అమెరికా బలగాలు రాత్రి సమయంలో 20కి పైగా హెచ్చరికలు జారీ చేసినా నౌక స్పందించలేదని తెలిపాయి. ప్రస్తుతం ఆ నౌక ఒమన్ గల్ఫ్‌లో నిలిచిపోయిందని, ఇంకా దానిపై అమెరికా బలగాలు ఎక్కలేదని సైనిక చర్యలపై అవగాహన ఉన్న ఓ అమెరికా అధికారి చెప్పారు. అమెరికా దిగ్బంధనాన్ని ఉల్లంఘించేందుకు ప్రయత్నించిన ఆరు నౌకలను ఇప్పటివరకు అడ్డుకున్నట్లు సైన్యం వెల్లడించింది. వాటిలో ఒకదానికి అనుమతి ఇచ్చారు. మరో 116 నౌకలను ఇతర మార్గాలకు మళ్లించినట్లు తెలిపింది.

**కాల్పుల విరమణ పొడిగింపుపై ఉత్కంఠ...**

ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ప్రారంభమైన మధ్యప్రాచ్య యుద్ధం తర్వాత ఇరాన్ హోర్ముజ్ జలసంధిని సమర్థంగా మూసివేసిందని పేర్కొంటూ అమెరికా ఏప్రిల్ 17న దిగ్బంధనం ప్రారంభించింది. ఏప్రిల్ 7 నుంచి సున్నితమైన కాల్పుల విరమణ కొనసాగుతోంది. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు జరిపే సమయంలో ఈ కాల్పుల విరమణను మరో 60 రోజులు పొడిగించే ఒప్పందం కుదురుతుందా అనే అంశంపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. ఇరాన్, ఒమన్‌ల మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధిలో పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. భారీ స్థాయిలో చమురు, సహజవాయువు, ఎరువుల వంటి సరఫరాలు నిలిచిపోవడంతో వినియోగదారులు, ఆహార ఉత్పత్తిదారులపై ఒత్తిడి పెరుగుతోంది. దిగ్బంధనం ద్వారా ఇరాన్ ఎగుమతులను పరిమితం చేసి, నగదు ప్రవాహాన్ని తగ్గించాలన్నదే అమెరికా లక్ష్యంగా కనిపిస్తోంది. ఇప్పటికే బలహీనపడిన ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై మరింత ఒత్తిడి తీసుకురావాలని చూస్తోంది.

**ఇంకా నిర్ణయం తీసుకోని ట్రంప్...**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం తన సలహాదారులతో సమావేశమయ్యారు. అయితే కాల్పుల విరమణ పొడిగింపు, జలసంధి పునఃప్రారంభంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఈ ఒప్పందం ఇంకా ఖరారు కాలేదని ఇరాన్ పేర్కొంది. ఇరాన్ అనుమతి తప్పనిసరి అని ప్రకటిస్తున్నప్పటికీ, వాణిజ్య నౌకల రాకపోకలు నిశ్శబ్దంగా కొనసాగుతున్నాయి. అయితే యుద్ధానికి ముందు ఉన్న స్థాయితో పోలిస్తే వాటి సంఖ్య గణనీయంగా తగ్గింది. "ఈ నిబంధనలను ఉల్లంఘించే ఏ చర్య అయినా వారి ప్రయాణ భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తుంది" అని ఇరాన్ సంయుక్త సైనిక కమాండ్ శనివారం హెచ్చరించింది. తమ చర్యల్లో జోక్యం చేసుకునే సైనిక నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని తెలిపింది. ఇరాన్ జలసంధి గుండా వెళ్లే నౌకల నుంచి గరిష్ఠంగా 20 లక్షల డాలర్ల వరకు రుసుము వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇది శాంతియుత సముద్ర రాకపోకల స్వేచ్ఛ అనే అంతర్జాతీయ సముద్ర వాణిజ్య సూత్రానికి విరుద్ధమని నిపుణులు చెబుతున్నారు.

**అంతర్జాతీయ సముద్ర వాణిజ్యానికి...**

షేక్ సౌద్ బిన్ అబ్దుల్రహ్మాన్ బిన్ హసన్ బిన్ అలీ అల్ థానీ మాట్లాడుతూ, సాధారణ పరిస్థితుల్లో రాకపోకలపై రుసుములు విధించడాన్ని తమ దేశం వ్యతిరేకిస్తుందని చెప్పారు. అయితే మైన్ల తొలగింపు వంటి తాత్కాలిక అవసరాల కోసం పరిమిత కాలం రుసుములు వసూలు చేయడం చర్చించదగిన అంశమని వ్యాఖ్యానించారు. అలాంటి చర్యలు హోర్ముజ్ జలసంధిలో సాధారణ పరిస్థితులు పునరుద్ధరించడానికి తోడ్పడవచ్చని అన్నారు. అమెరికా అధికారులు ఇప్పటికే తెలిపిన వివరాల ప్రకారం, హోర్ముజ్ జలసంధిలో ఇప్పటివరకు ఎలాంటి మైన్లను గుర్తించలేదని, వాటిని నిర్వీర్యం చేసిన దాఖలాలు కూడా లేవని వెల్లడించారు.

## గండిపేట భూ కుంభకోణం.. బొల్లా బ్రహ్మనాయుడే కీలక వ్యక్తి: డీసీపీ శ్రీనివాస్

- మొదటి పేజి తరువాయి

బొల్లా బ్రహ్మనాయుడి పాత్ర అత్యంత కీలకంగా ఉంది. గండిపేటలోని వివాదాస్పద భూమిని క్రమబద్ధీకరించినట్లుగా నకిలీ ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) సృష్టించేందుకు, ప్రధాన నిందితుడైన రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు రూ.4 కోట్లు చెల్లించినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ లావాదేవీలన్నీ నగదు రూపంలోనే జరిగాయని, ఈ సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కుట్రలో భాగంగా నిందితులు అత్యంత పకడ్బందీగా నకిలీ పత్రాలు సృష్టించారని, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల నుంచి అనుమతులు వచ్చినట్లు నకిలీ దస్త్రాలు, ఐఏఎస్ అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఉత్తర్వులు తయారు చేశారని వివరించారు.

గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో నకిలీ జీవోలు సర్క్యులేట్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లతో పాటు ప్రధాన నిందితుడు రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు. ఇప్పటికే 9 కేసులలో నిందితుడిగా ఉన్న రాధాకృష్ణ నుంచి కందుకూరు, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన పలు భూముల పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల నుంచి నకిలీ జీవో కాపీలు, 13 నకిలీ స్టాంపులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, చెక్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గండిపేటలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఈ కుట్ర పన్నారు. దీని విలువ మార్కెట్ అంచనాల ప్రకారం రూ.1000 నుంచి రూ.1500 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటికే ఈ భూమికి సంబంధించిన యాజమాన్య హక్కుల పిటిషన్‌ను 2025లోనే హైకోర్టు కొట్టివేసినప్పటికీ, ఇంత విలువైన భూమిపై ఒప్పందాలు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని డీసీపీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్‌తో పాటు మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని డీసీపీ శ్రీనివాస్ వివరించారు. నగదు రూపంలో జరిగిన కోట్ల రూపాయల లావాదేవీలపైనా దృష్టి సారించి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం.. ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె హెచ్చరించారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహంపై ఓ వ్యక్తి దాడి చేసి ధ్వంసం చేశాడని షర్మిల తెలిపారు. పట్టపగలు ఈ ఘటన జరుగుతుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకపోవడం హేయమైన చర్య అని ఆమె విమర్శించారు. దాడి చేసిన వ్యక్తికి మానసిక స్థితి బాగోలేదని చెప్పి పోలీసులు చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు. ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపు ఉందని షర్మిల ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ఘటనలను చూస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడితో పాటు, అతని వెనుక ఉన్న శక్తులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

పాత విగ్రహం స్థానంలో వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నంద్యాలలో అదే సెంటర్‌లో తాను ఆమరణ దీక్షకు దిగుతానని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

## విశాఖ-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు..

ఆంధ్రప్రదేశ్‌లో రవాణా రంగానికి సంబంధించి ఒక శుభవార్త వెలువడింది. విశాఖపట్నం-విజయవాడ నగరాల మధ్య బుల్లెట్ రైలు (హైస్పీడ్ రైల్) ప్రాజెక్టును తీసుకురానున్నట్లు ఏపీ బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ వెల్లడించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్వయంగా తనకు ఈ విషయాన్ని తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే, ఇరు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. మరోవైపు, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ (రాశిబ్ష్త్ర జశ్ఘుర్ ఘుఅశ్రీఘ్యుఎ్గ శీఅవ) రేపటి నుంచి (జూన్ 1) విశాఖపట్నం కేంద్రంగా అధికారిక కార్యకలాపాలు ప్రారంభించనుందని మాధవ్ స్పష్టం చేశారు. ఈ జోన్ సాధన కోసం బీజేపీ సుమారు 30 ఏళ్లుగా పోరాటం చేసిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం విశాఖ-విజయవాడ మధ్య రైలు ప్రయాణానికి 5 నుంచి 6 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే, ఈ 350 కిలోమీటర్ల దూరాన్ని కేవలం గంటన్నరలోనే పూర్తి చేయవచ్చని అంచనా. ఈ రైలును తొలుత గంటకు 320 కిలోమీటర్ల వేగంతో నడపాలని, భవిష్యత్తులో వేగాన్ని మరింత పెంచాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ కారిడార్ విజయవాడ నుంచి ఏలూరు, రాజమండ్రి, కాకినాడ మీదుగా విశాఖపట్నం చేరేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 'ఫైనల్ లొకేషన్ సర్వే' అనుమతుల కోసం క్షేత్రస్థాయి అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. దేశవ్యాప్తంగా ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో ఏపీ మీదుగా ఇప్పటికే మూడు వెళు ్తుండగా, ఇది రాష్ట్రానికి అదనపు ప్రయోజనం చేకూర్చనుంది. దీంతో పాటు విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. ఈ కొత్త ప్రాజెక్టులు ఉత్తరాంధ్రతో పాటు మొత్తం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిస్తాయని భావిస్తున్నారు.

## విశాఖ రైల్వే జోన్ నేటి నుంచే... సీఎం చంద్రబాబు ఏమన్నారంటే!

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపు (జూన్ 1న) అధికారికంగా ప్రారంభం కానుండటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక మైలురాయి అని, దశాబ్దాల కల నెరవేరుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రం సమూలంగా మారిపోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడటంతో పాటు పారిశ్రామిక వృద్ధికి కూడా బాటలు పడతాయని తెలిపారు. రాష్ట్రాన్ని ఒక లాజిస్టిక్స్ హబ్‌గా మార్చే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పరిణామం ఎంతో దోహదపడుతుందని వివరించారు.

ఏపీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు

- మొదటి పేజి తరువాయి

సెల్యులార్ సంకేతాలను పంపిస్తోంది. ఇది ఉగ్రవాదుల రహస్య కమ్యూనికేషన్లకూ ఊపిరిగా ఉపయోగపడుతోందని అధికారులు వెల్లడించారు.

ఇటీవల పాకిస్థాన్ చర్యలు అధికారుల అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ పీర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో చొరబాట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు నియంత్రణ రేఖకు అటువైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్ల సంకేతాలు కరుడు గట్టిన ఉగ్రవాదులున్న జైళ్లకు చేరుతున్నాయి. కశ్మీర్‌లోని పర్వతశ్రేణులు సహజంగా చాలా వరకు సంకేతాలను అడ్డుకొంటున్నా.. మైదాన ప్రాంతం ఉన్న జమ్మూలో మాత్రం ఈ సంకేతాలు భారత్‌లోకి చొరబడి ఉగ్రనెట్‌వర్క్‌లకు చేరుతున్నాయి. ముఖ్యంగా కతువా, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి ప్రదేశాల వద్ద పాక్ టెలికామ్ సిగ్నల్స్‌ను మన దళాలు గుర్తించాయి. కొన్ని జైళ్లలో ఇప్పటికే జామర్లను ఏర్పాటు చేసినా వీటిని అడ్డుకోవడంలో విఫలం అవుతున్నాయి. అక్రమంగా కారాగారాల్లోకి చేరిన ఫోన్లను ఖైదీలు వినియోగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 14 జైళ్లు, రెండు కరెక్షన్ హోమ్‌లు ఉన్నాయి.

పాకిస్థాన్ టవర్లు చైనాకు చెందిన సీడీఎంఏ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. వీటిల్లో అత్యున్నత స్థాయి ఎన్‌క్రిప్షన్ సాధ్యమవుతుంది. ఇది ఉగ్రవాదులు వాడే వైఎస్ఎంఎస్‌కు ఉపయోగపడుతుంది. సీడీఎంఏ పలు సిగ్నల్స్‌ను ఏకకాలంలో అనుమతిస్తుంది. దీంతో భద్రతా ఏజెన్సీల ఎలక్ట్రానిక్ మానిటరింగ్ సమస్యాత్మకంగా మారుతుంది. దీంతో ఉగ్రవాదులు వైఎస్ఎంఎస్ టెక్నాలజీని విరివిగా వాడుతున్నారు. దీంతో పాక్ పంపే సిగ్నల్స్‌తో పీవోకేలోని హ్యాండ్లర్లు, చొరబాటుదారులు, వారికి ఆశ్రయం ఇచ్చే వారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఈ అక్రమ విధానాలతో పాకిస్థాన్ ఐరాస అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ రాజ్యాంగంలోని 45 ఆర్టికల్‌ను ఉల్లంఘిస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ ఆర్టికల్ ప్రకారం ఒప్పందంపై సంతకాలు చేసిన మొత్తం 193 దేశాలు తమ భూభాగం నుంచి అధిక, రోగ్, తప్పుడు, తప్పుదోవ పట్టించే సంకేతాలు పక్కదేశాల్లోకి వెళ్లకుండా సహకరించుకోవాలి.

## ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు... అధికారికంగా ప్రకటించాలి

- మొదటి పేజి తరువాయి

ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్నాయని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

## రొయ్యలకు మేత వేసి, పొలంలో దుక్కి దున్ని...

- మొదటి పేజి తరువాయి

ఉన్న తన సొంతూరు అగర్తిపాలెం చేరుకున్నారు. అక్కడ తన రొయ్యల చెరువులో మేత వేసి, రొయ్యల ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం వరి పొలంలోకి దిగి, ట్రాక్టర్‌తో స్వయంగా దుక్కి దున్నారు. కూలీలతో మాట్లాడారు. ఆ తర్వాత, గ్రామస్థులతో కలిసి శ్రమదానంతో అభివృద్ధి చేస్తున్న హిందూ శ్మశానవాటిక పనుల పురోగతిని సమీక్షించారు.

తిరిగి పాలకొల్లుకు సైకిల్‌పై పయనం అవుతుండగా, రోడ్డు పక్కన వేస్తున్న జలజీవన్ మిషన్ పైపులైన్‌ను గమనించారు. భవిష్యత్తులో మరమ్మతుల కోసం కొత్తగా మంజూరైన సిమెంట్ రోడ్డును తవ్వాల్సిన అవసరం రాకుండా, పైప్‌లైన్‌ను పక్కగా వేయాలని ఆర్అండ్‌బీ అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.ంఈ పర్యటన వివరాలను ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "సెలవు రోజున కొద్దిపాటి సమయం దొరకడంతో సొంత వ్యవసాయ పనుల్లో పాల్గొనడం ఎంతో సంతృప్తి, ఆనందం కలిగించింది" అని ఆయన పేర్కొన్నారు.

## ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ వెనకడుగు.. చర్చలంటూనే దాడి హెచ్చరికలు

ఇరాన్‌తో అణు ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన వైట్‌హౌస్‌లో జరిగిన కీలక సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీ నుంచి ట్రంప్ ఏ నిర్ణయం ప్రకటించకుండానే వెళ్ళిపోయారని అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) పేర్కొంది. దీంతో ఇరు దేశాల మధ్య కుదిరిందని భావించిన తాత్కాలిక ఒప్పందం భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ సమావేశానికి ముందు ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, ఇరాన్‌తో ఒప్పందం జరగాలంటే కొన్ని కఠిన షరతులు విధించారు. సంఘర్షణల కారణంగా మూతపడిన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయబోమని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను తమకు అప్పగించాలన్నది కూడా తమ ప్రధాన షరతుల్లో ఒకటని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, అమెరికా పెడుతున్న ఈ షరతులను ఇరాన్ మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది. ఒకవైపు చర్చల ప్రక్రియ కొనసాగుతుండగానే, అమెరికా తన కఠిన వైఖరిని ప్రదర్శించింది. ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని అమెరికా యుద్ధ కార్యదర్శి పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. సింగపూర్‌లో జరిగిన షాంగ్రీ-లా డైలాగ్‌లో ఆయన మాట్లాడుతూ.. "అవసరమైతే దాడులను పునఃప్రారంభించే సామర్థ్యం మాకుంది. మా ఆయుధ నిల్వలు అందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు ట్రంప్ ఒక మంచి ఒప్పందం కోరుకుంటున్నారని, కానీ ఇరాన్ అణు ఆశయాలను అరికట్టేలా అది ఉండాలని స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా దౌత్యపరమైన హామీలపై తమకు నమ్మకం లేదని ఇరాన్ తెలిపింది. గతంలో చర్చలు జరుగుతున్నప్పుడే తమపై రెండుసార్లు దాడులు జరిగాయని గుర్తుచేసింది. ఇరాన్ రాయభారి మహమ్మద్ బఘేర్ ఖలీబాఫ్ మాట్లాడుతూ.. "మాకు హామీలు లేదా మాటలపై నమ్మకం లేదు, కేవలం చర్యలనే విశ్వసిస్తాం. చర్చల ద్వారా కాదు, క్షిపణుల ద్వారానే మాకు రాయితీలు లభిస్తాయి" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ మాజీ కమాండర్ మొహసెన్ రెజాయీ కూడా ట్రంప్ ఉద్దేశాలను అనుమానించారు. దౌత్యానికి ట్రంప్ మూడోసారి ద్రోహం చేస్తున్నారని, చర్చల పేరుతో ఇతర లక్ష్యాలను నెరవేర్చుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి.

## వియత్నాం చేతికి 'బ్రహ్మోస్' అస్త్రం.. డీల్ ఖరారు చేసిన భారత్

- మొదటి పేజి తరువాయి

నివేదికల ప్రకారం వియత్నాంతో కుదిరిన ఒప్పందం విలువ సుమారు రూ. 5,800 కోట్లు. ఇందులో భాగంగా తీరప్రాంత రక్షణ క్షిపణి వ్యవస్థలు, తొలి విడత క్షిపణులు, శిక్షణ, ఇతర సాంకేతిక సహకారం అందించనున్నారు. భవిష్యత్తులో వియత్నాం గగనతలం నుంచి ప్రయోగించే బ్రహ్మోస్ క్షిపణులను కూడా కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ సుమారు 375 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందంతో బ్రహ్మోస్‌ను కొనుగోలు చేసిన తొలి విదేశీ దేశంగా నిలిచింది. ఇప్పుడు వియత్నాం, త్వరలో ఇండోనేషియా కూడా ఈ జాబితాలో చేరనున్నాయి.

దక్షిణ చైనా సముద్రంలో చైనాతో తీవ్రమైన ప్రాదేశిక వివాదాలు ఎదుర్కొంటున్న వియత్నాం, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు తమ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకుంటున్న తరుణంలో ఈ ఒప్పందాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ధ్వని కన్నా మూడు రెట్ల వేగంతో (మాక్ 3) ప్రయాణించే బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గాలి, సముద్రం నుంచి ప్రయోగించవచ్చు. దీని వేగం, కచ్చితత్వం కారణంగా శత్రువుల యుద్ధ నౌకలను, కీలక సైనిక స్థావరాలను వేగంగా ఛేదించగలదు.

2020 గల్వాన్ ఘర్షణల తర్వాత చైనాతో సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో తన వ్యూహాత్మక ప్రభావాన్ని పెంచుకోవాలని భారత్ భావిస్తోంది. రక్షణ ఎగుమతులను 2030 నాటికి రూ. 50,000 కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మలేషియా, థాయ్‌లాండ్ వంటి ఇతర ఆగ్నేయాసియా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

# ఎలుగుబంటి సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి




పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

- ఎలుగుబంటి సంచరిస్తున్న గ్రామాలలో పర్యటన.
- పాడేరు డివిజన్ ఫారెస్ట్ అధికారిణి కే ఉమామహేశ్వరి.
- ఎలుగుబంటి సంచారంపై పెన్ పవర్ కథనానికి స్పందన.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 31.** అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల పరిధిలో గత రెండు రోజులుగా ఎలుగుబంటి జనావాసలోకి సంచరిస్తూ ప్రజలను దడ పుట్టిస్తున్నాయి. కడుతుల, దులిపుట్టు, వంద్రంగుల తదితర గ్రామాల్లో ఎలుగుబంటి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాడేరు డివిజనల్ ఫారెస్ట్ అధికారిణి కే ఉమామహేశ్వరి అన్నారు. పెన్ పవర్ వార్త కథనాల ద్వారా "ఎలుగుబంటి సంచారం" సమాచారం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు కడుతుల, దులిపుట్టు, వంద్రంగుల తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎఫ్ డిఓ ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. ఎలుగుబంటి సంచరిస్తున్న ప్రాంతం సుజనకోట అటవీ బ్లాకుగా గుర్తించమన్నారు. ఆ బ్లాక్ ను ఆనుకుని ఉన్న గ్రామాలైన కడుతుల, ధూళిపుట్టు, బొంద్రుగూడ, పనసపుట్టు, పోలిపుట్టు, ముంజపుట్టు, బరడ, వంద్రంగుల తదితర గ్రామాల ప్రజలకు ఎలుగుబంటి సంచరించే ప్రదేశాలలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. ముఖ్యంగా ఎలుగుబంటి అడవి మామిడి, జీడి, పనస దిగుబడి సమయం కాబట్టి ఎలుగుబంటులు ఆహారము కొరకు అడవి బయటకు వస్తుంటాయని తెలియజేశారు. ఈ క్రమంలో ఎవరు కూడా సూర్యోదయానికి ముందు, రాత్రి వేళలో పొలాలకు, కొండపోడులకు వెళ్ళరాదని అన్నారు. పగలు వెళ్లేటప్పుడు కూడా ఎక్కువమంది గుంపులుగా వెళ్లాలని, పొరపాటున ఎలుగుబంటి తారసపడినప్పుడు రెండు చేతులు పైకెత్తి గట్టిగా అరుస్తూ వెనకకు వెళ్ల వలెనని తెలియజేశారు. అదేవిధంగా ఎలుగుబంటి సంచరించే గ్రామాల్లో ఎటువంటి సమయంలో ఆరు బయటకు, బహిర్భూమికు వెళ్లాలో వివరించారు. ఎవరు కూడా ఆరుబయట ఎలుగుబంట్లకు ఇష్టపడే ఆహార పదార్థాలు ఉంచరాదన్నారు. ఒంటరి ఎలుగుబంటి కంటే పిల్లలతో ఉన్న ఎలుగుబంటి మరింత ప్రమాదమని తెలియజేశారు. కాగా ఆదివారం సాయంత్రం రంగబాయలు పంచాయితీ లంగభపోదోర్ గ్రామంలో ఎలుగుబంటి ఓ పంట పొలాల దగ్గర సంచరించినట్లు స్థానికులు తెలిపారు. ఫారెస్ట్అధికారులు ఎలుగుబంటిని బంధించి జనవాసలోకి దూరంగా సురక్షిత ప్రాంతంలో విడిచి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు ఫారెస్ట్ బ్రాంచ్ ఆఫీసర్ ఎం మురళీకృష్ణ, సిబ్బంది కొర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## కనకల కుటుంబ బారసాల వేడుకలో పాల్గొన్న సిరమ్మ.. చిన్నారికి ఆశీస్సులు



**పద్మనాభం, పెన్ పవర్, మే 31 :** భీమిలి నియోజకవర్గంలోని పద్మనాభం మం డలం మద్ది గ్రామంలో శ్రీ కనకల త్రినాథ్, మహా లక్ష్మి దంపతుల కుమార్తె బారసాల కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వారి ఆ హ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వ యకర్త మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ కార్య క్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల పార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణ, భీమిలి మండల పార్టీ అధ్యక్షులు గాడు శ్రీను, మద్ది గ్రామ సర్పం చ్ సత్యనారాయణ, ఆది బాబు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, ప్రజాప్రతిని ధులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## బై బై. వైసీపీ అంటూ టీడీపీ లో చేరిన కార్యకర్తలు..!

**వైసీపీ వైఫల్యాలతో విసుగు చెంది టీడీపీలో చేరిన వందలాది మంది కార్యకర్తలు: వరబోయిని బొంజుబాబు ఆవేదన**



**హుకుంపేట, పెన్ పవర్ మే 31:** అల్లూరి సీతారామరాజు జిల్లా
హుకుంపేట మండలం దుర్గం పంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించినప్పటి నుండి పార్టీ అభివృద్ధి కోసం, గెలుపు కోసం సొంత ఇల్లులా భావించి అహర్నిశలు శ్రమించినా, ఆ పార్టీలో కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి గుర్తింపు దక్కలేదని దుర్గం గ్రామం గొడ్డుమామిడి గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు వరబోయిని బొంజుబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ సిద్ధాంతాలపై ఇష్టం ఉన్నప్పటికీ, స్థానిక నాయకుల ఏకపక్ష వైఖరి, ప్రజల పట్ల నిర్లక్ష్యపు పరిస్థితులు ఏమాత్రం బాగోలేవని ఆయన మండిపడ్డారు. హుకుంపేట మండలం దుర్గం పంచాయతీలోని గొడ్డుమామిడి గ్రామం మరియు పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 120 మంది ముఖ్య కార్యకర్తలతో కలిసి ఆయన వైసీపీకి గుడ్ బై చెప్పి ఇటీవల కాలంలోనే తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బొంజుబాబు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో తీవ్రంగా ఉన్న రహదారులు, సిసి రోడ్లు, డ్రైనేజీలు మరియు తాగునీటి సమస్యలపై స్థానిక వైసిపి నాయకులకు, అలాగే ప్రస్తుత ఎమ్మెల్యే దృష్టికి ఎన్నోమార్లు తీసుకెళ్లామని, తమ సమస్యలు విన్నవించుకోవడానికి వారి చుట్టూ ఎన్నోసార్లు తిరిగినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గతంలో ఉన్న ఎమ్మెల్యే కనీసం ఫోన్ చేస్తే స్పందించి మాట్లాడేవారని, కానీ ఇప్పుడున్న ఎమ్మెల్యే మాత్రం కనీసం ఫోన్ చేసినా ఏమాత్రం చలించడం లేదని శ్రేణులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి. ప్రస్తుత ఎమ్మెల్యే మరియు స్థానిక వైసీపీ నాయకుల తీరును బట్టి చూస్తే రాబోయే రోజుల్లో ఆ పార్టీ అగాధ పాతాళంలోకి తొక్కిసలాడటం ఖాయమని, పార్టీకి అండదండగా ఉన్న అసలైన నాయకులను విడిచిపెట్టి కార్యకర్తల కష్టసుఖాలను పట్టించుకోని వీరంతా రాబోయే రోజుల్లో వైసీపీ ఘోర ఓటమిని కళ్లారా చూస్తారని వారు గట్టిగా హెచ్చరించారు. ఇలాంటి కష్టకాలంలో తెలుగుదేశం పార్టీ తమకు అండగా నిలిచిందని, టీడీపీ హయాంలోనే దుర్గం నుండి పాలమామిడి, గొడ్డుమామిడి, రణంకోట వరకు రోడ్డు పనులను పూర్తి చేసి తమ దశాబ్దాల కష్టాలను తీర్చారని హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రాంత కష్టాలను ఎవరు తీరిస్తే వారి వెంటే మేముంటామని, పైగా తమ పంచాయతీ పరిధిలో నిలిచిపోయిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని టీడీపీ నాయకత్వం గట్టి హామీ ఇవ్వడంతోనే తామంతా పార్టీ మారినట్లు స్పష్టం చేశారు. తమతో పాటు నందిపుట్టు, గొడ్డుమామిడి, పాలమామిడి, దుర్గం, బంగారంగరువు, మొండికోట, పాటిగరువు, సరసుపాడు, అందేర్లకోట, బలమల, అల్లంపుట్టు, ఉప్ప, దిగవూరు, మత్స్యపురం, గున్నమామిడి, గండవగరువు, సెంభి, పెద్దబుర్లుగా, ఊటగుప్పు, నేరోడివలస, వాకపల్లి, తోటకురపాడు గ్రామాలలోని ప్రజలందరూ తమ వెంటే ఉన్నారని, రాబోయే రోజుల్లో హుకుంపేట మండలంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయానికి, సంస్థాగత బలోపేతానికి తామంతా శాయశక్తులా కృషి చేస్తామని ఈ సందర్భంగా బొంజుబాబు మరియు చేరిన నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# క్రీడాకారుల విజయాల్లో తల్లిదండ్రులు, కోచ్‌ల పాత్ర కీలకం మంత్రి రాంప్రసాద్ రెడ్డి




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 31:** క్రీడాకారులను ప్రోత్సహించడంలో తల్లిదండ్రు లు, కోచ్‌ల పాత్ర అమూల్యమని రాష్ట్ర క్రీడా, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడాకారులకు అత్యుత్త మ శిక్షణ, ఆధునిక మౌలిక వసతులు, అవసర మైన ప్రోత్సాహకాలు అందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ శాప్)ఆధ్వర్యంలో గోపాలపట్నం లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిం చిన సమ్మర్ కోచింగ్ క్యాంపుల ముగింపు ఉత్సవం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా క్రీడా అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం. అభిషిక్త్ కిశోర్, ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం పెంపొందించడంతో పాటు ఉపాధి అవకాశాలకు కూడా దోహదపడతాయని పేర్కొ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నా రు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడు తూ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకా రులు, వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, శిక్షణ అందిస్తున్న కోచ్‌లకు అభినందనలు తెలిపారు. క్రీడలు శారీరక, మానసిక వికాసంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించేందు కు దోహదపడతాయని చెప్పారు. ఈ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ సమ్మర్ కోచింగ్ క్యాంపులు భవిష్యత్ క్రీడా తారలను గుర్తించి తీర్చిదిద్దే వేదికలుగా నిలుస్తున్నాయని అన్నారు. చిన్ననాటి నుంచే సరైన శిక్షణ అందిస్తే విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు మెరుగవుతాయని పేర్కొ న్నారు. విశాఖపట్నాన్ని రాష్ట్ర క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో ద్రోణా చార్య, అర్జున అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు ప్రశంసాప త్రాలు అందజేశారు. క్రీడాకారుల ప్రతిభా విన్యా సాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో శాప్ బోర్డు డైరెక్టర్ ఎం. దుర్గా రమేష్ కుమార్, డీఎస్డీవో జూన్ గ్యాలియట్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె. సూర్యనా రాయణ, ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమణా రావు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# శాప్ స్పోర్ట్స్ అకాడమీ ట్రయల్స్‌కు విశాఖలో విశేష స్పందన

- క్రీడాకారుల ప్రతిభకు అంతర్జాతీయ స్థాయి శిక్షణే లక్ష్యం: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 31:** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న శాఫ్ స్టేట్ స్పోర్ట్స్ అకాడమీ ఎంపిక ట్రయల్స్‌కు విశాఖపట్నంలో విశేష స్పందన లభించింది. మధురవాడలోని బక్కన్నపాలెం శాఫ్ స్టేడియంలో ఆదివారం జరిగిన ట్రయల్స్ ను రాష్ట్ర క్రీడా, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సందర్శించి పరిశీలించారు.

ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన యువ క్రీడాకారుల ప్రతిభను మంత్రి ప్రత్యక్షంగా గమనించారు. స్టేడియంలోని సైక్లింగ్ ట్రాక్‌పై స్వయంగా సైక్లింగ్ చేసి అక్కడి సదుపాయాల ను పరిశీలించారు. అలాగే వాటర్ స్పోర్ట్స్‌కు సంబంధించిన పరికరాలను తనిఖీ చేసి వాటి వినియోగంపై అధికారులతో చర్చించారు. ట్రయ ల్స్‌కు హాజరైన క్రీడాకారులతో ముచ్చటించి వారికి అందుతున్న వసతుల గురించి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతిభా వంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి ప్రత్యే క శిక్షణ అందించేందుకు ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శారీ రక దారుఢ్యం, సాంకేతిక నైపుణ్యం, ఆటలో ప్రదర్శన వంటి అంశాలను ప్రామాణికంగా తీసు కుని పూర్తిస్థాయి పారదర్శకతతో ఎంపికలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగ అభివృద్ధికి అత్యంత ప్రా ధాన్యత ఇస్తోందన్నారు. క్రీడాకారులకు నివా సం, భోజనం, శిక్షణతో పాటు అవసరమైన అ న్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పా రు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ నియామకా లలో స్పోర్ట్స్ కోటా ద్వారా వందలాది మంది క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు లభించాయని గుర్తుచేశారు. క్రీడలను జీవితంలో భాగంగా చేసు కుంటే యువతకు మెరుగైన భవిష్యత్ అవకాశా లు అందుబాటులోకి వస్తాయని మంత్రి పేర్కొ న్నారు. రాష్ట్రంలో క్రీడా ప్రతిభను తీర్చిదిద్దేందు కు కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం కేంద్రాలు గా మూడు స్టేట్ స్పోర్ట్స్ అకాడమీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశాఖ కేంద్రంలో సైక్లింగ్, అథ్లెటిక్స్, వాటర్ స్పోర్ట్స్ విభాగాలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయక త్వంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభు త్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన క్రీడా వసతుల పునరుద్ధరణకు భారీ నిధులు కేటా యించి అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పా రు. కొమ్మాదిలోని 27 ఎకరాల క్రీడా ప్రాంగణాన్ని రాష్ట్రంలోనే అత్యుత్తమ క్రీడా కేంద్రంగా అభి వృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. పారా అథ్లె టిక్స్ క్రీడాకారులకు కూడా సమాన అవకాశాలు, అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని క్రీడా సంఘా లతో సమన్వయం చేసుకుంటూ క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎంపికైన క్రీడాకారులకు శాఫ్ అకాడమీల ద్వారా ఉన్నత స్థాయి శిక్షణ, ఆధునిక సదుపాయాలు, నిపుణుల పర్యవేక్ష ణలో ప్రత్యేక కోచింగ్ అందించనున్నట్లు అధికా రులు తెలిపారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారుల ను తీర్చిదిద్దడమే అకాడమీల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జూన్ గ్యాలియెట్, క్రీడా శాఖ అధికారులు, వివి ధ క్రీడా సంఘాల ప్రతినిధులు, ఎంపిక కమిటీ సభ్యులు, శిక్షకులు, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.



# ఆదివాసీ ప్రాంతాలకు 16వ ఆర్థిక సంఘం నిధులు అధికంగా కేటాయించాలి

**జీకే వీధి టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు విజ్ఞప్తి**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 31:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘం ద్వారా భారీగా నిధులు కేటాయించడం శుభపరిణామమని జీకే వీధి టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు అన్నారు. 2030-31 వరకు ఐదేళ్ల కాలానికి రూ.4,35,236 కోట్ల గ్రాంట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ సిఫార్సు చేయడం గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల అభివృద్ధికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.16,627 కోట్లు, తెలంగాణకు రూ.9,968 కోట్లు కేటాయించారని తెలిపారు.అయితే మారుమూల ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని అరకు, పాడేరు నియోజకవర్గాల మండలాలకు అధికంగా ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లను విజ్ఞప్తి చేశారు. జీకే వీధి మండలంలో ఇప్పటికీ అనేక గ్రామాలకు సరైన రహదారి సదుపాయాలు లేక గిరిజనులు వాగులు, వంకలు దాటి వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందన్నారు. గర్భిణీలు డోలీల ద్వారా ఆస్పత్రులకు తరలించే పరిస్థితులు కొనసాగుతున్నాయని, అత్యవసర వైద్య సేవలు అందక ప్రాణనష్టం సంభవిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అంబులెన్స్, ఆటో, కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని గ్రామాలు ఇంకా ఉన్నాయని తెలిపారు.చాలా పంచాయతీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, విద్య, వైద్యం వంటి మౌళిక వసతులు లేక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చదువుకున్న గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. జీవో నంబర్-3 పునరుద్ధరించాలని కూడా ప్రభుత్వాన్ని కోరారు.ఇటీవల జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా తారు రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీరు, సాగునీటి చెక్‌డ్యామ్‌లు, పాఠశాల భవనాలు, జల జీవన్ మిషన్ బోర్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించి పలు తీర్మానాలు అధికారులకు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదివాసీ



ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి మౌళిక వసతులు కల్పించాలని పొత్తూరు కొండలరావు విజ్ఞప్తి చేశారు.

## ముగిసిన అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరం



**టెక్కలి, పెన్ పవర్ మే 31 :** టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం లో శాప్ ఆధ్వర్యంలో గత 31 రోజులుగా జరిగిన అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ శిబిరంలో క్రీడాకారులు అనేకమైన టెక్నిక్స్, స్కిల్స్, ఫిజికల్ ఫిట్నెస్, మెరిట్ ఏసియన్, మరెన్నో వేసవి శిక్షణ శిబిరంలో నేర్పించారు. అలాగే ఈ నెల రోజులు శిక్షణ శిబిరంలో రన్స్ , త్రోస్,జంప్స్,ఈవెంట్స్ లో స్కిల్స్ కూడా నేర్పించారు. అథ్లెటిక్స్ ఇన్చార్జ్ కాపల రఘునాథరావు ఆధ్వర్యంలో ఈ వేసవి శిక్షణ శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో కే.కే.రామిరెడ్డి, నారాయణరావు,లక్ష్మణ్ రాజా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## సంతబొమ్మాళి గ్రంథాలయంలో స్లో సైక్లింగ్ పోటీలు



**టెక్కలి, పెన్ పవర్ మే 31 :** సంతబొమ్మాళి మండల కేంద్రం లోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇండోర్ గేమ్స్ స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా విభజించి విద్యార్థిని విద్యార్థులకు స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి ఎస్ ఉదయ్ కిరణ్ తెలిపారు. ఈ పోటీల్లో 24 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కూర్మా రావు సేవలు స్ఫూర్తిదాయకమైనవి.

- పదవీ విరమణ కార్యక్రమంలో ఘన సన్మానంలో వక్తలు.




**చింతపల్లి పెన్ పవర్ మే 31.** ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జే కూర్మారావు సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గా 42 సంవత్సరాల సుదీర్ఘమైన సేవలను అందించి ఆదివారం ఆయన పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 42 సంవత్సరాల సుదీర్ఘమైన గౌరవప్రదమైన సేవలను అందించారన్నారు. 07.07.1983 లో ఉద్యోగంలో చేరిన ఆయన తన సేవా కాలంలో నిబద్ధత నిజాయితీ మరియు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ఎక్సైజ్ శాఖకు ఎనలేని సేవలు అందించడంతోపాటు విశిష్ట గుర్తింపును తీసుకువచ్చారన్నారు. విధులలో భాగంగా నాటు సారాయి నిర్మూలన అక్రమ మద్యం అరికట్టడంలో కీలకపాత్ర పోషించి ఎంతో మంది యువ అధికారులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కూర్మారావు అందించిన సేవలు శాఖకు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని వారు కొనియాడారు. ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విశ్రాంత శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని వారు ఆకాంక్షించారు. అనంతరం దుస్సాలువ కప్పి పుష్పగుచ్ఛంతో ఘనంగా ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ అవగాహన సదస్సును విజయవంతం చేద్దాం

- జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ పిలుపు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 31:** పాడేరు శాసన సభ్యులు, అల్లూరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్న బూత్ స్థాయి ఏజెంట్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవగాహన సదస్సును విజయవంతం చేయాలని జీకే వీధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ పిలుపునిచ్చారు.జూన్ 2వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు పాడేరు కేంద్రంలోని "కాఫీ హౌస్"లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.గూడెం కొత్తవీధి మండల పరిధిలోని 56 మంది బూత్ స్థాయి ఏజెంట్లు, పంచాయితీ పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లా, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఉత్తరాంధ్ర చిరకాల స్వప్నం సాకారం.. దక్షిణ రైల్వే జోన్ ప్రారంభం



**టెక్కలి, పెన్ పవర్ మే 31 :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల ఆకాంక్ష, మూడు తరాల పోరాటాల ఫలితంగా విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపటి నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించనుండటం చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంపు కార్యాలయం నుండి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో సువర్ణ అధ్యాయానికి నాంది పలికే మైలురాయని ఆయన అభివర్ణించారు. దీర్ఘకాలంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు చేసిన నిరంతర ఉద్యమాలకు ఇది విజయ చిహ్నమని మంత్రి తెలిపారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని 'డబుల్ ఇంజన్ సర్కార్' కృషి వల్లే ఈ మహత్తర లక్ష్యం సాకారమైందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో రైల్వే జోన్ అంశాన్ని చేర్చేందుకు కృషి చేసిన తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీల పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధికి కొత్త దిశ**

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో పరిపాలనా వికేంద్రీకరణకు బలమైన పునాది పడటమే కాకుండా, రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణ, కొత్త ప్రాజెక్టుల అమలు, సరకు రవాణా సామర్థ్యాల పెంపు, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణకు విస్తృత అవకాశాలు ఏర్పడనున్నాయని మంత్రి వివరించారు. విశాఖపట్నం దేశంలోని ప్రముఖ రవాణా, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే ప్రక్రియలో ఈ జోన్ కీలక పాత్ర పోషించనుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక యువతకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో విశాఖపట్నంలో ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో విశాఖ కేంద్రంగా బుల్లెట్ రైలు ప్రాజెక్టు రూపుదిద్దుకునే అవకాశాలపై కేంద్ర రైల్వే శాఖ చేసిన ప్రకటన ఉత్తరాంధ్ర ప్రజల్లో కొత్త ఆశలను నింపిందన్నారు.

**ఎర్రన్నాయుడు కలకు నేడు రూపం**

దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాధన వెనుక దివంగత మహానేత కింజరాపు ఎర్రన్నాయుడు చేసిన పోరాటం చిరస్మరణీయమని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో పలుమార్లు గళమెత్తిన ఎర్రన్నాయుడు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది అత్యవసరమని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. రైల్వే మౌలిక వసతుల విస్తరణ, కొత్త రైళ్ల మంజూరు, ఉపాధి అవకాశాల పెంపు కోసం ఆయన చేసిన కృషి ఉత్తరాంధ్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షను జాతీయ స్థాయిలో ప్రతిధ్వనింపజేసిన ఎర్రన్నాయుడు కల నేడు సాకారం కావడం గర్వకారణమని మంత్రి తెలిపారు.

**తెలుగు ప్రజల తరఫున కృతజ్ఞతలు**

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరికను నెరవేర్చి దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు కార్యరూపం దాల్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లకు తెలుగు ప్రజల తరఫున మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన యుగానికి నాంది. ఇది ప్రాంతీయ ఆకాంక్షల విజయమే కాకుండా, సమగ్ర అభివృద్ధి దిశగా భారత రైల్వే చరిత్రలో నిలిచిపోయే ఘట్టం" అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**టెక్కలి, పెన్ పవర్ మే 31 :** సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రామానికి చెందిన దారపు రాజు (27) అనే యువకుడు ఆదివారం విద్యుత్ స్తంభాన్ని ద్విచక్ర వాహనంతో ఢీకొని మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రామానికి చెందిన దారపు రాజుకి కోటబొమ్మాళి గ్రామానికి చెందిన దీపికతో మే 10న వివాహం జరిగింది. కోటబొమ్మాళి లోని తన అత్తవారింటికి ద్విచక్ర వాహనంపై భార్య దీపికతో కలిసి ఆదివారం వెళ్లారు. తిరిగి స్వగ్రామం మూలపేటకి బయలుదేరు వస్తుండగా సవరపేట జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభానికి ఢీకొని రాజు మృతి చెందాడు. కోటబొమ్మాళి ప్రభుత్వాసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ ధృవీకరించారు. కాళ్లకు పారాణి ఆరకముందే భర్త మరణ వార్త విని, తనకు దిక్కెవరిని భార్య దీపిక కన్నీరు మున్నీరుగా విలపించింది. దీంతో ఇరు కుటుంబాల్లో, మూలపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శవాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులు అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సంతబొమ్మాళి ఎస్సై వై. సింహాచలం తెలిపారు.

## బరెంగుల మినీ అంగన్వాడి పోస్ట్ గ్రామ మహిళకే కేటాయించాలి

- వేరే గ్రామాల వారికి నియమిస్తున్న అంగన్వాడి సూపర్వైజర్ పై చర్యలకు డిమాండ్.
- గిరిజన సంఘం నాయకులు గల్లెల జీనబంధు, నారాయణ, సీతారాం.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 31.** మండలంలో గల కరీముఖిపుట్టు పంచాయతీ బరెంగుల గ్రామంలో మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టు గ్రామ మహిళలకు కేటాయించాలని గిరిజన సంఘం నాయకులు గల్లెల జీనబందు, నారాయణ, సీతారాం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ.. బరెంగుల గ్రామంలో అంగన్వాడి కేంద్రం లేకపోవడం వలన గ్రామంలో గల బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బరెంగుల మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టును ఇతర గ్రామాలకు చెందిన వారికి కేటాయించడం సరికాదని, గ్రామంలో అర్హత ఉన్న మహిళలు ఉన్నారన్నారు. బరెంగుల గ్రామంలో గత 2004 సంవత్సరం నుండి నేటి వరకు అంగన్వాడి కార్యకర్త భర్తీ కొరకు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. మినీ అంగన్వాడీ కార్యకర్త భర్తీకి ఖాళీ చూపించకుండానే సంబంధిత అంగన్వాడి సూపర్వైజర్ బరెంగుల గ్రామంలో పోస్ట్ భర్తీ అయ్యిందని చెప్పడం విడ్డూరంగా ఉందని గిరిజన సంఘం నాయకులు మండిపడ్డారు. గ్రామంలో ప్రత్యేక అధికారులు పర్యటించి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలనీ, గ్రామస్తులు అనుమతి లేకుండా వేరే గ్రామాల వాళ్లకి ఎలా నియమించారని, నియమించిన సూపర్వైజర్ పై తగు చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి రాజు, వి గోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో ప్రైవేట్ మహిళా జూనియర్ కళాశాల మంజూరు




**నర్సీపట్నం, పెన్ పవర్ ( మే 31) :** మహిళల విద్యాభివృద్ధికి మరో ముందడుగుగా నర్సీపట్నంలో ఆదిత్య నూతన మహిళా జూనియర్ కళాశాల మంజూరు కావడంపై కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. కళాశాల మంజూరుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా ప్రత్యేక కృషి చేసిన చింతకాయల అయ్యన్నపాత్రుడుకు యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. నూతన మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థినులకు ఉన్నత విద్య మరింత చేరువ కానుందని యాజమాన్యం పేర్కొంది. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో బాలికల విద్యాభ్యాసానికి ప్రోత్సాహం లభిస్తుందని తెలిపింది. ఈ కళాశాల మంజూరుతో నర్సీపట్నం విద్యా రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, మహిళల సాధికారతకు ఇది దోహదపడుతుందని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ లగుడు హరిప్రసాద్, అయ్యన్నపాత్రుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ విద్యారంగ అభివృద్ధికి ఆయన సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు.

# మహానాడును విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు

**జీకే వీధి టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 31:** జీకే వీధి మండలంలో మే 27, 28 తేదీల్లో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం వహించారని, మానవ వనరుల, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఆయన ఆశయాలు, ప్రజాసంక్షేమ కార్యక్రమాలను స్మరించుకుంటూ మహానాడు వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలోనే చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. మహానాడు కార్యక్రమాల విజయానికి సహకరించిన పార్టీ ఇన్‌చార్జీలు, మండల, పంచాయతీ, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, టీడీపీ కుటుంబ సభ్యులందరికీ పొత్తూరు కొండలరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.






## ఇండియన్ ఆర్మీ సేవలో ఆదివాసి గిరిజన బిడ్డ.



**కొయ్యూరు,పెన్ పవర్ మే 30:** మండలంలోని బంగారంపేట గ్రామానికి చెందిన యువకుడు ఇండియన్ ఆర్మీలో తన సేవలు అందించేందుకు సిద్ధం అయ్యాడు. దీంతో ఆ గ్రామంలో ఆ ఆర్మీ సేవలందించే ఆ యువకునికి హారతులు పట్టి ఆతనిని అశ్విరధించారు. కొయ్యూరు మండలం బంగారంపేటకు గ్రామంలో మాజీ సర్పంచ్ పాంగి రాజబాబు ఉమా మహేశ్వరి దంపతుల రెండవ కుమారుడు పాంగి కృష్ణవంశీ గత ఏడాది ఇండియన్ ఆర్మీ అగ్ని వీర్ నోటిఫికేషన్ లో సెలెక్ట్ అయ్యి కృష్ణవంశీ ట్రైనింగ్ పూర్తి చేశాడు. ఇతనికి ఆర్మీ సేవలకు రావాలని ఆదేశాలు జారీ కావటంతో ఆదివారం ఇక్కడ నుండి బయిలదేరాడు . కొయ్యూరు మండలం నుంచి ఇండియన్ ఆర్మీ సేవలో గిరిజన బిడ్డ వెళుతున్న నేపథ్యంలో అతనిని ఆదర్శంగా తీసుకుని మరింత మంది యువత అందరు మరెన్నో సేవలు అందించాలని కోరుతూ పలువురు రాజకీయ నేతలైన మాజీ జీసిసి చైర్మెన్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎంవివి ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు కాకురీ చంద్రరావు, మాజీ జడ్పీటీసీ గాడి శ్రీరామ్మూర్తి, మాజీ ఎంపిపి కొలిసింగి సత్యనారాయణ, ఐటిడిపి ఇంచార్జి కురుజు శ్రీను, మాజీ ఎంపీటీసీ శివరామరాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్రు రామూర్తి గ్రామస్తులు,శ్రేయోభిలాషులు అగ్ని వీర్ కు వెళుతున్న కృష్ణవంశీ కు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

## 42 ఏళ్ల స్వామిసేవకు ఘన సత్కారం

- సింహాచలంలో కేశఖండనశాల ఉద్యోగికి భావోద్వేగ వీడ్కోలు



**సింహాచలం, పెన్ పవర్, మే :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి దివ్య సన్నిధిలో 42 సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలు అందించిన కేశఖండనశాల ఉద్యోగి అడివరపు కృష్ణ పదవీ విరమణ పొందిన సందర్భంగా సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నాలుగు దశాబ్దాలకు పైగా స్వామివారి సేవలో తరించిన ఆయనకు అధికారులు, సహచర ఉద్యోగులు, భక్తులు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. అడివరపు కృష్ణ దంపతులు, కుటుంబ సభ్యులకు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసరావు, పర్యవేక్షణ అధికారి జి.వి.ఎస్.కె. ప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఘన స్వాగతం లభించింది. అనంతరం వారు స్వామివారి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, మూలవిరాట్టును దర్శించుకున్నారు. వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన కళ్యాణ మండపంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు పాల్గొని అడివరపు కృష్ణను శాలువాతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "42 సంవత్సరాల పాటు భక్తిశ్రద్ధలతో, నిబద్ధతతో స్వామివారి సేవలో కొనసాగడం గొప్ప విషయం. కేశఖండనశాలలో ఆయన అందించిన సేవలు దేవస్థాన చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని కొనియాడారు. అనంతరం అడివరపు కృష్ణకు సంబంధించిన పదవీ విరమణ ప్రయోజనాలను పూర్తిగా అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానానికి చెందిన వివిధ విభాగాల అధికారులు, అర్చక స్వాములు, ఉద్యోగులు, సహచర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన సేవలను ప్రశంసించారు. పుష్పగుచ్ఛాలు, శేషవస్త్రాలతో సన్మానించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సేవా ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న అడివరపు కృష్ణకు స్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని పలువురు ఆకాంక్షించారు.

## గాజువాక బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన కలెక్టర్



**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటింపు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 31 :** గాజువాక సమీపంలో ఆదివారం తెల్లవారుజా మున జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గా యపడిన బాధితులను జిల్లా కలెక్టర్ ఎం. అభి షిక్త్ కిశోర్ ఆసుపత్రిలో పరామర్శించారు. క్షతగా త్రుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఆయన, బాధితులకు అత్యుత్త మ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున ప్రతి మృ తుడి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబా లకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుం దని భరోసా ఇచ్చారు. ఆదివారం ఉదయం సుమారు 4:10 గంటల సమయంలో జాతీయ రహదారిపై గాజువాక పోలీస్ స్టేషన్ సమీపంలో రాజమండ్రి నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు, పంక్చర్ కారణంగా రోడ్డుపై నిలిచివున్న లారీని ఢీకొట్టినట్లు కలెక్టర్ తెలిపారు. బస్సులో సుమారు 35 మంది ప్రయాణికులు ఉన్నారని, ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, ఎనిమిది మంది తీవ్రంగా గాయపడి నట్లు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్సులు, రెస్క్యూ బృందాలు వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టినట్లు తెలి పారు. తీవ్రంగా గాయపడిన వారిలో ఒకరి పరి స్థితి విషమంగా ఉన్నప్పటికీ వైద్యులు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారని, మిగిలిన ఏడుగురు క్షతగాత్రులు ప్రమాదం నుంచి బయటపడి స్థిరం గా ఉన్నారని వివరించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఇప్పటికే సమాచారం అందించామ ని, బాధితులకు అవసరమైన అన్ని వైద్య, ఇతర సహాయ చర్యలను జిల్లా యంత్రాంగం పర్యవేక్షిస్తోందని కలెక్టర్ తెలిపారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు విధుల్లో ఉన్నారని, తునిలో డ్రైవర్ మార్పు జరిగిన అనంతరం వెనుక కూ ర్చున్న డ్రైవర్ ప్రమాదంలో మృతి చెందగా, బ స్సు నడుపుతున్న మరో డ్రైవర్ గాయపడి చికి త్స పొందుతున్నారని చెప్పారు. ఆయన ప్రాణా పాయం నుంచి బయటపడ్డారని వెల్లడించారు.

ప్రభుత్వం తరఫున బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామ ని, వారి కుటుంబాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుం టున్నామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## పొగాకు కు దూరంగా ఉండండి- ఈగల్ సిఐ దేముళ్ళు.

**చింతపల్లి పెన్ పవర్ మే 31.** పొగాకు మరి పొగాకుతో తయారయ్యే ఉత్పత్తులకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని ఈగల్ సీఐ దేముళ్ళు అన్నారు. రాష్ట్ర ఐజిపి ఆకే రవికృష్ణ, ఈగల్ ఐ జి పి ఎం మహేశ్వర రాజు, ఈగల్ స్పెషల్ అడ్మినిస్ట్రేషన్ కె నాగేష్ బాబు ఆదేశాలతో సీఐ దేముళ్ళు ఆదివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమం జీకే వీధి మండలం జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో డాక్టర్ మణిదీప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు త్రాగడం వలన కలిగే నష్టాలను తెలియజేశారు. పొగాకు తయారయ్యే ఖైని, గుట్కా, సిగరెట్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అలాగే ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ గరుడ, సామూహిక పనుల గురించి వివరించారు. డ్రగ్స్ వలన శారీరక మరియు మానసిక ఆరోగ్యం పై వచ్చే ప్రభావాలను నేరచరిత్ర పై ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్ డి పి ఎస్ చట్టం కింద కేసులలో ఇరుక్కుంటే ఎదురయ్యే పరిణామాలు మరియు శిక్షల గురించి స్పష్టమైన అవగాహన కల్పించారు. గంజాయి సంబంధిత సమాచారం తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబర్ సమాచారం అందించాలని, సమాచారం అందించిన వివరాలు గోప్యంగా





ఉంచబడతాయి అన్నారు. అనంతరం పొగాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మరియు ఈగల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## కళాశాలలో సీట్లులేక వలస వెళుతున్న విద్యార్థులు.!

- గిరిజన విద్యార్థులకు కళాశాల సీట్లు పెంచాలి
- పదో తరగతి దాటితే చదువు ఆగొద్దు.
- ప్రభుత్వం వెంటనే స్పందించి సీట్ల భరోసా కల్పించాలి.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం డిమాండ్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 31.** పదో తరగతి చదువు దాటితే చదువు ఆపకుండా గిరిజన విద్యార్థులకు కళాశాలలో సీట్లు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..గిరిజన యువత నేడు విద్యారంగంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని, పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ, ఆ తర్వాత ఉన్నత విద్యను కొనసాగించే దశలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని నీలకంఠం ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకోవాలనే ఆసక్తి, సామర్థ్యం ఉన్న వందలాది మంది గిరిజన విద్యార్థులకు కూడా ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో తగినన్ని సీట్లు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని వారు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం అడ్మిషన్ల సమయంలో సీట్ల కొరత సమస్య పునరావృతమవుతూనే ఉందని, అయినప్పటికీ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వ అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ తగిన ప్రణాళికలు రూపొందించడం లేదని విమర్శించారు. దీని ఫలితంగా పదో తరగతి తర్వాత అనేక మంది గిరిజన విద్యార్థులు మధ్యలోనే చదువులకు దూర మవుతున్నారన్నారు. విద్యార్థులు



ఉన్నత విద్య అవకాశాలు లేక నిరాశకు గురవుతూ, తమ తల్లిదండ్రుల కలలు మరియు ఆకాంక్షలకు విరుద్ధంగా కూలి పనులకు, వలస బాట పడుతున్నారని, ఇది కేవలం ఒక విద్యా సమస్య మాత్రమే కాదు, గిరిజన సమాజ భవిష్యత్తుకు, ఆత్మగౌరవానికి సంబంధించిన కీలకమైన అంశం అని ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, గిరిజన మండల కేంద్రాల్లో కొత్త ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే ఉన్న కళాశాలల్లో అదనపు సెక్షన్లు ఏర్పాటు చేసి సీట్లను యుద్ధప్రాతిపదికన పెంచాలనీ, హాస్టల్ వసతి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క గిరిజన విద్యార్థికి సీటు లభించేలా సీట్ల భరోసా డ్రైవ్" చేపట్టాలని, పాఠశాల వరకు చదివించి, కళాశాల దశలో అవకాశాలు కల్పించకపోతే అది విద్యార్థుల వైఫల్యం కాదు, వ్యవస్థ వైఫల్యం అని ఆయన స్పష్టం చేశారు. నేటి యువతకు విద్యా అవకాశాలు కల్పించడం అంటే రేపటి గిరిజన సమాజ భవిష్యత్తును బలోపేతం చేయడమేనని, రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కును గిరిజన బిడ్డలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. కావున ఈ విద్యా సంవత్సరం ఒక్క గిరిజన విద్యార్థి కూడా సీటు లేదు అనే కారణంతో చదువు మానేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆదివాసి వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం కోరారు. విద్యతోనే విముక్తి, విద్యతోనే అభివృద్ధి. గిరిజన బిడ్డల చదువు – మనందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## మద్యం సేవించి అతివేగం వాహనాలు నడపరాదని సూచన.

- కొయ్యూరు సీఐ,మంప, కొయ్యూరు ఎస్సై లు యువతకు అవగాహన.



**కొయ్యూరు,పెన్ పవర్ మే 30:** ద్విచక్ర వాహనాలను నడిపే వారంతా మద్యం సేవించి గానీ,అతివేగంతో గానీ ఎట్టి పరిస్థితుల్లో వాహనాలతో ప్రయాణించకూడదని కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, మంప ఎస్ ఐ శ్రీనివాస్ లు అన్నారు. కొయ్యూరు వారపు సంతలో ఆదివారం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ ఐ శ్రీనివాస్ లు ఇక్కడకు వారపు సంతకు వచ్చే మారుమూల గిరి యువతకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్, సిట్ బెల్ట్ ధరించాలని, భద్రత నియమాలను పాటించాలని అన్నారు. అలాగే నాటు సారా తయారు లేదా విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి చట్టం అమలుకు సహకరించాలని తెలిపారు. మహిళల పట్ల పెచ్చుపెరిగిపోతున్న అఘాత్యాలు నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సి ఐ, ఎస్ ఐ లు సూచించారు. చట్టాలను ప్రతి పౌరులుగా బాధ్యతాయుత వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎస్ ఐ కిషోర్ వర్మ, మంప ఎస్ ఐ శ్రీనివాస్ ఏపీ ఎల్ఎస్ పి పోలీసులు పాల్గొన్నారు.

## నేడు కొయ్యూరు లో ఎమ్మెల్సీ గ్రీష్మ చే కొత్త పింఛన్ల పంపిణీ.

మండల టీడీపీ పార్టీ కార్యదర్శి తోట దొరబాబు.



**కొయ్యూరు,పెన్ పవర్ మే 31 :** రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పంపిణీ చేస్తున్న పింఛన్ల ను శాసన మండలి సభ్యులు (ఎంఎల్ సి) కావాలి గ్రీష్మ చేతుల మీదుగా అధికారికంగా పంపిణీ చేయనున్నట్టు టీడీపీ పార్టీ కార్యదర్శి తోట దొరబాబు, ఎంపీడీవో జీవిడి ప్రసాద్ లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రమైన రాజేంద్రపాలెం లో సోమవారం ఉదయం ప్రారంభమై ఈ కొత్త పింఛన్ల కార్యక్రమం నిర్వహించనున్నందున టీడీపీ కూటమి పార్టీకి చెందిన ముఖ్య నాయకులు , ఏఎంసి , చైర్మన్లు,మండల పార్టీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు సంబధిత అధికార్లు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఎంపీడీవో ప్రసాద్, టీడీపీ కార్యదర్శి దొరబాబు ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

# జెడ్పి నిధులతో ముంచంగిపుట్టు సంతలో సిసి రోడ్డు నిర్మాణం

- 5 లక్షల నిధులతో 100 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం.
- మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ.
- వైసిపి నాయకులు సన్యాసిరావు, రాజారావు, పాపారాయుడు, తిరుపతిరావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 31.** మండల కేంద్రంలో గల శనివారం వారపు సంతలో జిల్లా పరిషత్ నిధులు 5 లక్షలతో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు మండల వైస్ ఎంపీపి పాటుబోయి సత్యనారాయణ, వైసీపీ నాయకులు గొల్లూరి సన్యాసిరావు, రాజారావు పాపారాయుడు, తిరుపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో సంతలో వస్తున్న వ్యాపారస్తులకు, ప్రజలకు బురద మాయంగా మారటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని, ఈ నేపద్యంలోనే ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్రతో మాట్లాడి జిల్లా పరిషత్ నిధులు ఐదు లక్షలు కేటాయించి సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించమన్నారు. సీసీ రోడ్డు నిర్మాణం వల్ల ప్రజలకు కొంతమేర ఇబ్బంది తప్పుతుందన్నారు. దఫాలుగా వారీగా పూర్తిస్థాయిలో సిసి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని వారు తెలిపారు. సిసి రోడ్డు నిర్మాణం వల్ల వ్యాపారస్తులకు, ప్రజలకు వర్షాకాలంలో బురద నుంచి కొంత ఉపశమనం కలుగుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

# బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 31:** మండల కేంద్రంలోని జీసీసీ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం నీలవరం గ్రామానికి చెందిన కొర్రా గాసి (45) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, ఎర్రవరం గ్రామానికి చెందిన కొర్ర బాబురావు అధిక వేగంతో నడుపుతున్న ద్విచక్ర వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.ఢీకొన్న ప్రభావంతో బైక్ బోల్తా పడగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను గూడెం కొత్తవీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బైక్ నడిపిన వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# మరమ్మత్తుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజ్ఞప్తి**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మే 31 :** స్థానిక విశాఖ పశ్చిమ, బుచ్చిరాజుపాలెం ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ ఏపీఎస్ఈబీ కాలనీ ఫీడర్పై మరమ్మత్తుల పనులు చేపట్టనున్నందున జూన్ 1 (సోమవారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆపరేషన్ జోన్--3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. సింహాచలం నాయుడు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరచడం, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా నిర్వహణ పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ పనుల కారణంగా సుసర్ల కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, సీతారామ్ రాజు నగర్, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు.

ప్రజలు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, మరమ్మత్తుల పనులు సజావుగా సాగేందుకు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. సింహాచలం నాయుడు కోరారు. పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని, ప్రజల సహకారంతో నిర్వహణ పనులు త్వరగా పూర్తవుతాయని వెల్లడించారు. అధికారులు ప్రజలు ఈ సమాచారాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో ఘనంగా సమ్మర్ కోచింగ్ క్యాంప్







- ముగింపు వేడుకల్లో పాల్గొన్న క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- విశాఖను క్రీడా రాజధానిగా తీర్చిదిద్దుతాం ప్రభుత్వ విప్ గణబాబు
- క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఒలింపిక్స్‌లో విశాఖ ముద్ర పడాలన్నదే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మే 31 :** ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా ప్రతిభను వెలికితీయడం, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్) ఆధ్వర్యంలో నిర్వహించిన "సమ్మర్ కోచింగ్ క్యాంప్--2026" ముగింపు వేడుకలు ఆదివారం గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ క్రీడా విభాగాల్లో నిర్వహించిన ఈ వేసవి శిక్షణా శిబిరాల ముగింపు కార్యక్రమం క్రీడాకారులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను అభినందించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, జిల్లా, రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిల్లో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దడంలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు సరైన శిక్షణ, మౌలిక వసతులు అందితే ప్రపంచ స్థాయిలో విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒలింపిక్ పతక విజేత కర్ణం మల్లీశ్వరి దేశానికి కీర్తి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, విశాఖపట్నం యువతలో కూడా అంతే స్థాయి ప్రతిభ ఉందని చెప్పారు. గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం విశాఖపట్నాన్ని అన్ని రకాల క్రీడలకు అనువైన కేంద్రంగా అభివృద్ధి చేస్తూ, భవిష్యత్తులో దేశంలోని ప్రముఖ క్రీడా నగరాల సరసన నిలబెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జీవీఎంసీ, శాప్ సంయుక్త ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు ఈ శిబిరాల ద్వారా లబ్ధి పొందారని తెలిపారు.

రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని స్పష్టం చేశారు. క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వడం కోసం ఇటీవల అసెంబ్లీలో నూతన స్పోర్ట్స్ బిల్లును ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విశాఖపట్నంలో ఇప్పటికే ఉన్న క్రీడా మౌలిక వసతులను మరింత ఆధునికీకరించడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సదుపాయాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ, ప్రభుత్వ విప్ గణబాబు స్వయంగా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు కావడం వల్ల క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కొనియాడారు. గోపాలపట్నం ఇండోర్ స్టేడియం మరియు క్రీడా మైదానాల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు.



భవిష్యత్తులో జరిగే ప్రతి ఒలింపిక్ క్రీడా విభాగంలోనూ విశాఖపట్నం నుంచి కనీసం ఒక క్రీడాకారుడు దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణ, సాంకేతిక నైపుణ్యాలు, ఆధునిక క్రీడా వసతులు కల్పించడం ద్వారా యువతను ప్రపంచ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తామని చెప్పారు.

**కోచ్‌లకు ఘన సత్కారం..**

సమ్మర్ కోచింగ్ క్యాంప్ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిన కోచ్‌లను ఈ సందర్భంగా అతిథులు ఘనంగా సత్కరించారు. శిబిరంలో పాల్గొన్న పిల్లలకు అంకితభావంతో శిక్షణ అందించిన కోచ్‌లకు గౌరవ వేతనాలు అందజేసి అభినందనలు తెలిపారు. క్రీడా రంగంలో ప్రతిభావంతులైన యువతను తీర్చిదిద్దడంలో కోచ్‌ల పాత్ర అమూల్యమని వక్తలు కొనియాడారు. వారి కృషి వల్లే భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి పతకాలు తీసుకొచ్చే క్రీడాకారులు తయారవుతారని పేర్కొన్నారు. ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు ముగింపు వేడుకల్లో పాల్గొన్న క్రీడాకారులు, తల్లిదండ్రులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వ చర్యలను అభినందించారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ వివిధ క్రీడల్లో శిక్షణ పొందిన విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల సభ్యులు, అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ఓటర్ల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా సార్ కార్యక్రమం



**పెందుర్తి నియోజకవర్గంలో అవగాహన సదస్సు**

**పార్టీ శ్రేణులకు పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ దిశానిర్దేశం**

**పెందుర్తి, పెన్ పవర్, మే 31 :** ఓటర్ల హక్కుల పరిరక్షణతో పాటు ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదై ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం సబ్బవరం మండలంలోని జి.ఎస్.కన్వెన్షన్ హాల్‌లో బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఏఎస్) మరియు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్) కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కొత్తగా అర్హత పొందిన యువత ఓటర్లుగా నమోదు కావడానికి సహకరించడంతో పాటు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు, ఇతర సాంకేతిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. బూత్ లెవెల్ ఏజెంట్లు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సంప్రదించి ఓటరు జాబితాను పరిశీలించాలని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు బాధ్యతగా తీసుకుని సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన అన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు చిక్కాల రామారావు, మన్యం జిల్లా పరిశీలకులు సర్గడం చిన్న అప్పలనాయుడు రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, గండి రవికుమార్, సీనియర్ నాయకులు బొకం రామానాయుడు, బైలపూడి భగవాన్ జయరామ్, కోతన రాము, ఉప్పిలి కనకరాజు, జిల్లా ఉపాధ్యక్షులు దేవి సాంబ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలిశెట్టి సురేష్, జిల్లా వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కర్రి బాబు, కోన రామారావు, గోరపల్లి శ్రీను, వార్డు అధ్యక్షులు, ఐటీ వింగ్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ పీఏసీఎస్ సభ్యులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, బూత్ స్థాయి బాధ్యతలు, ఓటర్ల నమోదు విధానం, ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకమనే సందేశంతో సమావేశం ముగిసింది.

# బంటుపల్లి కుటుంబ వేడుకలో సందడి చేసిన సిరమ్మ

**బంటుపల్లి కుటుంబ ఆఫ్ సారీ వేడుకలో పాల్గొన్న సిరమ్మ.. చిన్నారికి ఆశీస్సులు**



**బిమిలి, పెన్ పవర్, మే 31:** భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం మం డలం బంటుపల్లి కల్లాలులో శ్రీ బంటుబిల్లి సూ రినాయుడు, పుష్ప దంపతుల కుమార్తె చి. తేజే శ్వరి ఆఫ్ సారీ కార్యక్రమం ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. వారి ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరా వు చిన్న శ్రీను కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్య క్షురాలు సిరమ్మ కార్యక్రమానికి హాజరై చి. తేజే శ్వరిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆనందపురం ఎంపీపీ ప్రతి నిధి మజ్జి వెంకటరావు, మండల పార్టీ నాయకు లు, మాజీ ఎంపీపీ పాండ్రంగి శ్రీను, ఆనందపురం మండల ఉపాధ్యక్షులు దాము, భీమిలి నియో జకవర్గ వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు జగన్, ముసలి నాయుడు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, ప్రజాప్రతినిధులు, స్థానిక ముఖ్య నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్య కర్తలు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరు లు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వండి.

**ఆడపిల్లకు కిక్ బాక్సింగ్ కరాటే ఆత్మరక్షణ క్రీడల అవసరం**

**రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్,టిడిపి కార్యదర్శి ఈతలపాక సుజాత**



**విశాఖ పశ్చిమ,పెన్ పవర్,మే 31:** జీవీఎంసీ 56 వ వార్డు కంచరపాలెం ఆర్ పి పేట ఉన్నత పాఠశాలలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్,జోనల్ కమిషనర్ హైమావతి పర్యవేక్షణలో అల్ ఇండియా ఎన్సీంట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, టైగర్ కిక్ బాక్సింగ్ కౌన్సిల్ అసోసియేషన్ సీనియర్ మాస్టర్ గుండి జానకి రాము ఆధ్వర్యంలో జీవీఎంసీ వేసవి క్రీడల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు కిక్ బాక్సింగ్ కోచింగ్ క్యాంప్ ని రాష్ట్ర మాదిగ కార్పోరేషన్ డైరెక్టర్,రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఈతలపాక సుజాత ఆదివారం సందర్శించారు,పాలు,కేక్, ఉడికించిన కోడిగుడ్డు బిస్కెట్ ప్యాకెట్లను తనవంతుగా ఆమె క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ప్రతి ఒక్కరూ క్రీడలకు ప్రాధాన్యతను ఇవ్వాలని ఆడపిల్లలు కిక్ బాక్సింగ్,కరాటే వంటి ఆత్మరక్షణ క్రీడాలను అభ్యసించాలని అదేవిధంగా జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయి క్రీడలలో క్రీడాకారులు పాల్గొనాలని ఆమె వారిని కోరారు.

కార్యక్రమంలో 56వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ కార్తీక్ యాదవ్,బి శ్రీకాంత్,కె కోటేశ్వరరావుఅసిస్టెంట్ కోచ్ బి భరత్, తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుపై వైసీపీ ఆరోపణలు అవాస్తవం: టీఎన్ఎస్ఎఫ్

- మెగా డీఎస్సీ, ఉపాధి కల్పనలో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోంది: ముచ్చకర్ల శివ



**గంగవరం, పెన్ పవర్ మే 31:** యువత భవిష్యత్తుపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని టీఎన్ఎస్ఎఫ్ రంపచోడవరం నియోజకవర్గ అధ్యక్షుడు ముచ్చకర్ల శివ పేర్కొన్నారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయ నియామకాల కోసం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో విద్య, ఉపాధి రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ యువతకు విస్తృత అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు, ఐటీ కంపెనీలను తీసుకువచ్చి భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.మెగా డీఎస్సీ నిర్వహణను అడ్డుకునేందుకు గతంలో కోర్టుల్లో పలు కేసులు వేసిన వైసీపీ నేతలు ఇప్పుడు ప్రభుత్వంపై విమర్శలు చేయడం విచిత్రంగా ఉందన్నారు. స్పోర్ట్స్ కోటా కింద జరిగిన నియామకాలపై వస్తున్న ఆరోపణలు కూడా నిరాధారమని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మూడు శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు వివరించారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఓర్చుకోలేక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.ఇకపై తప్పుడు ప్రచారం మానుకోవాలని, లేనిపక్షంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కమిటీలు నిరసన కార్యక్రమాలు చేపడతాయని ముచ్చకర్ల శివ హెచ్చరించారు.

# రోడ్ల విస్తరణలో ఆక్రమణలను తొలగిస్తాం

రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్ మే 31:** కోట్లాది రూపాయలతో కడియం మండలంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనుల్లో అడ్డువచ్చిన ఆక్రమణలన్ని తొలగిస్థామని మినహాయింపు లేదని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పష్టం చేశారు. కడియం- వీరవరం రోడ్డు విస్తరణలో ఆక్రమణల తొలగింపుపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆదివారం ఆయన ఆ ప్రదేశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా దోసాలమ్మ కాలనీ జంక్షన్‌లో ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాలని తాసిల్దార్ సునీల్ కుమార్ కు ఆదేశించారు. దోసాలమమ్మ కాలనీ వైపు, వీరవరం రోడ్డులో ఉన్న ఆక్రమణలను ఆయన పరిశీలించారు. రోడ్డు విస్తరించినప్పటికీ ఆక్రమణల వల్ల వాహనాలు కనిపించే పరిస్థితులు లేవని సిఫార్సులు, వత్తుళ్ళు పట్టించుకోవద్దని సూచించారు. రోడ్ల విస్తరణకు కావాల్సినన్ని నిధులు ఈ రెండేళ్ల కాలంలో సమకూర్చానని ఆక్రమణల వల్ల రోడ్లు వేసిన ఆశించిన ప్రయోజనం ఉండదన్నారు. దోసాలమ్మ కాలనీ నాలుగు రోడ్ల జంక్షన్ సంపూర్ణ మార్పులు జరగనున్నా యన్నారు.ఈ కాలనీని అనుకుని దాత ఇచ్చిన స్థలం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. మండలంలో విద్యుత్ సమస్యలు లేకుండా చేయడానికి వీరవరంలో సబ్ స్టేషన్ నిర్మించాలని ప్రయత్నిస్తున్న స్థలం దొరకని పరిస్థితి ఉందన్నారు. ఆక్రమణలు తొలగించి ఆ ప్రదేశంలో విద్యుత్తు సబ్ స్టేషన్ నిర్మించి మండల వ్యాప్తంగా ప్రజలకు, రైతులకు మెరుగైన విద్యుత్తును అందిస్తామన్నారు. ఆక్రమణలకు తాను మొదటి నుంచి వ్యతిరేకినన్నారు. గతంలో ధవళేశ్వరం రోడ్డు ఆక్రమణలు తొలగించి విస్తరించిన తీరును వివరించారు. కొంతమంది కోసం ఆక్రమణలకు అవకాశం ఇస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఆక్రమణ లలో రాజీ పడే ప్రసక్తే లేదని అధికారులు మళ్లీ సర్వే చేసి తొలగింపు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే తెలిపారు. బుర్రిలంక ఆంజనేయ స్వామి విగ్రహం జాతీయ రహదారి నుంచి చిరంజీవి ఆఫీస్ మీదుగా సిమెంట్ రోడ్డు నిర్మించమన్నారు. ఆ రోడ్డు కొనసాగింపుగా కడియం వరకూ రోడ్డు నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు, రైతులు కోరడంతో పరిశీలించారు. త్వరలోనే ఈ రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు గట్టి నరసయ్య, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, ఏ.ఎం.సీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, గట్టి సుబ్బారావు, పాఠంశెట్టి రాంజీ, అల్లంపల్లి ప్రసాద్, వారా రాము, నూనె వెంకటేశ్వరరావు, కోమలి రామకృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం








- 150 మందికి వైద్య సేవలు

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మే 31:** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ తెలిపారు.ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో సుమారు 150 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు ఆయన వెల్లడించారు. డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమా మహేష్, డాక్టర్ శ్రీనివాస్ రాయుడు, డాక్టర్ పావని ప్రియ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు.శిబిరంలో 71 మందికి రక్త పరీక్షలు, 7 మందికి థైరాయిడ్ పరీక్షలు, ఒకరికి ఈసీజీ, 5 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా, 20 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు.అలాగే శిబిరానికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు మామిడి పండ్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, వైద్య సేవల సమన్వయకర్త కానుమొను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




# గోదావరి డెల్టాకు ఖరీఫ్ సాగునీటి విడుదల





- బ్యారేజీ మరమ్మతులకు రూ.148 కోట్లు
- మంత్రి కందుల దుర్గేష్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 31:** జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద ఆదివారం రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు సమక్షంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ గోదావరి జలాలను కాలువలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నదని చెప్పారు.

రైతులు నాట్లు ముందుగానే వేసుకొని పంటలను రక్షించుకోవాలని సూచించారు. ముందస్తు నీటి విడుదల వల్ల పంట త్వరగా చేతికొచ్చి రైతులు నష్టాల నుంచి బయటపడతారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం గోదావరి డెల్టాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల మరమ్మతులకు నిధులు కేటాయించలేదని మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బ్యారేజ్ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కాలువల మరమ్మతుల కోసం మరో రూ.13 కోట్లు విడుదల చేసి, సాగునీటి సంఘాల ద్వారా 80 శాతం పనులు చేపట్టినట్లు వెల్లడించారు.

రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి, 24 గంటల్లోనే వారి ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు నెలల తరబడి చెల్లింపుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారన్నారు.

కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యారేజ్ మరమ్మతులు, కాలువల పునరుద్ధరణ పనులు, నీటి విడుదల ద్వారా కాకినాడ జిల్లా పరిధిలో 1,37,838 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌లో 117 గేట్లను కొత్తవి ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసిందన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి విడుదలకు వార్షిక ప్రణాళిక రూపొందించిన ముఖ్యమంత్రి నిర్ణయాల ఫలితంగానే ధవళేశ్వరం నుంచి నీటి విడుదల జరుగు తోందన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాల పరిరక్షణ కోసం పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో రూ.100 కోట్ల నిధుల కేటాయింపుకు హామీ లభించిందన్నారు. గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మూరలశెట్టి సునీల్ కుమార్ మాట్లాడుతూ, ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి ఈస్టర్న్ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. వెస్టన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురళీకృష్ణరాజు మాట్లాడుతూ, గోదావరి డెల్టా పరిధిలోని రైతులు నీటిని పొదుపుగా వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు చీఫ్ ఇంజనీర్ చినబాబు, ధవళేశ్వరం ఎస్ ఈ జి. శ్రీనివాస్ రావు, హెడ్ వర్క్స్ ఎస్ ఈ శ్రీనివాస్, ఈ ఈ రామ కృష్ణ, విజ్జేశ్వరం ఈ ఈ రమేష్ బాబు, రైతులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేరస్తులు, రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



రౌడీ షీటర్లకు జిల్లా పోలీసులు కౌన్సెలింగ్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 31:** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నేరనియంత్రణ, శాంతిభద్రత పరిరక్షణలో భాగంగా ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు, నేరచరిత్ర , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు పోలీస్ అధికారులు మాట్లాడారు నేరాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో జీవించాలని, అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయి, మత్తుపదార్థాల వినియోగం లేదా రవాణా చేస్తే తీవ్ర చర్యలు తీసుకుం టామన్నారు. చెడు వ్యసనాలను మాని, మంచి నడవడికను అలవర్చుకోవాలని,సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడకూడదని హెచ్చరించారు.రౌడీ షీటర్లు, క్రైమ్ సస్పెక్ట్‌ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతు న్నారని, వారి కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గొడవలు, నేరాలలో పాల్గొన్నా వెంటనే లీగల్ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తులో ఏవైనా చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సినీ,రాజకీయ రంగాలలో సూపర్ స్టార్ కృష్ణ సేవలు చిరస్మరణీయం : జయంతి వేడుకల్లో వక్తలు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. మే 31.** సినీ రాజకీయ రంగాలలో సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబుల యువసేన అధ్యక్షులు లింగంపల్లి గాంధీ ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లిగూడెంలో సూపర్ స్టార్ కృష్ణ 83వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రూరల్ మండలం పడాల గ్రామంలో గల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎగ్గిన నాగబాబు, జనసేన సీనియర్ నాయకులు అడబాల నారాయణమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సూపర్ స్టార్ కృష్ణ సినీ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించిన మహానటుడు అని కొనియాడారు. తెలుగు చలనచిత్ర రంగానికి ఆధునిక టెక్నాలజీని తీసుకువచ్చిన తొలి నటుడు సూపర్ స్టార్ కృష్ణ అన్నారు. నిర్మాతలకు అండగా ఉండేవారు అన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకోవడానికి ముందుండేవారని గుర్తు చేశారు. తండ్రి సూపర్ స్టార్ కృష్ణ వారసత్వాన్ని కొనసాగిస్తూ నేడు సూపర్ స్టార్ మహేష్ బాబు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా గుండె వ్యాధితో బాధపడే చిన్నారులను ఆపరేషన్లు చేయించి ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. ఏలూరు పార్లమెంటు సభ్యుడిగా సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు అన్నారు. సామాన్య కార్యకర్తలను సైతం దగ్గరకు తీసుకుని ఎంతో ఆప్యాయంగా పేరు పెట్టి పలకరించే వారని గుర్తు చేసుకున్నారు. రాజకీయాలలో సూపర్ స్టార్ కృష్ణతో కలిసి పని చేసిన రోజులను, అనుభవాలను మరిచిపోలేమని పేర్కొన్నారు. తమ అభిమాన నటుడు సూపర్ స్టార్ కృష్ణ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన లింగంపల్లి గాంధీ, తదితరులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ల అభిమాన సంఘం నాయకులు మల్లుల విజయ్ కుమార్, సువ్వాడ శ్రీరామ్, కే.సుబ్బారావు, గొర్ల దుర్గారావు, సీలి ఆశీర్వాదం, ఎం. వెంకటేశ్వరరావు, సీలి మురళి, ఏ. కోటేశ్వరరావు, వై. కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం అధ్వానం..పర్యవేక్షణ అస్తవ్యస్తం



✷ దోమల బెడదతో సతమతం



**ఏలూరు మే 31 పెన్‌పవర్ :** ద్వారకా తిరుమల మండలంలోని తిరుమలం పాలెం గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.విధిగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు అలసత్వం వహింస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు.పారిశుధ్య నిర్వహణ క్షేత్ర స్దాయిలో అధికారుల పర్యవేక్షణ చేపట్టకపోవడంతో మండలంలో శివారు గ్రామమైన తిరుమలం పాలెంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని విమర్శలు వస్తున్నాయి

**ఎక్కడెక్కడంటే**

గ్రామంలోని తూర్పువీధి,ఎస్సీకాలనీతో పాటు పటు వీధులలో డ్రైనేజీలలో డ్రైనేజీలు సరిగా లేవు.నిర్మించినవి పూడుకుపోయాయి.పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక మురుగు నిలుస్తోంది.దీంతో సాయంత్ర అయితే దోమలు వీర విహారం చేస్తున్నాయి.పారిశుధ్య కార్మికులు కాలువల్లోని మురుగును పైపైన తీసి డ్రెయిన్ గట్టమీద వేస్తున్నారు.దీంతో కాలువ గట్టపై డ్రైన్‌లో తీసిన మురుగు గుట్టలు పేరుకుపోయాయి.పారిశుధ్య కార్మికులు వీటిని నెలల తరబడి తొలగించడంలేదు.కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్దాలు పేరుకుపోయి మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడి మురుగు ముందుకు కదలక దుర్వాసన వెలువడి దోమలు వృద్ధి చెందుతున్నాయి.సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉంది.ప్రజలు దోమల బెడదతో మరింత కష్టాలు ఎదుర్కోంటున్నారు.మురుగు పోవడానికి కాలువలు ఉన్నా పూడుకు పోవడంతో అధ్వానంగా ఉన్నాయి.దీంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది.కొన్ని చోట్ల మురుగు నీరు రోడ్డు పైకి వస్తుండటంతో ప్రజలకు అవస్దలు తప్పడంలేదు.

# మత్తేవారి గూడెంలో మురుగు పేరుకుంటోంది..కదలనంటోంది..!





**ఏలూరు మే 31 పెన్ పవర్ :** ప్రభుత్వం ' స్వర్ణాంద్ర-స్వచ్ఛాంద్ర ' పేరిట ప్రతి నెల మూడో శనివారం పట్టణ ,గ్రామాల్లో స్వచ్ఛత పనులు చేపడుతున్నారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా క్షేత్ర స్దాయిలో అధికారుల నిర్లక్షయం కారణంగా ఆచరణలో విఫలమవుతోంది.అధికారులు మొక్కుబడిగా కార్యక్రమం నిర్వహిస్తుండటంతో పట్టణం ,గ్రామాల్లో పారిశుధ్యం పడకేస్తోంది.దీంతో గ్రామాల్లో ఎక్కడి కక్కడ మురుగు పేరుకోంటోంది.ద్వారకా తిరుమల మండలం ఎం.నాగులాపల్లి పంచాయితీ పరిషధిలోని మత్తేవారి గూడెంలో జనావాసాల చెంతనే మురుగు పారుతోంది.పారిశుధ్య కార్మికుల నిర్లక్ష్యానికి కాలనీ వాసులు అవస్దలు పడుతున్నారు.కొందరు ఉన్నతాధికారుల మెప్పుకోసం మురుగు ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించి మమ అనిపిస్తున్నారు.నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ వారు గ్రామాలను సందర్శించక పోవడంతో పర్యవేక్షణ కొరవడింది.దీంతో పల్లేల్లో దోమలు విజృంబించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.15వ ఆర్దిక సంఘం నిధులను ప్రభుత్వం విడుదల చేసినా అవి ఎక్కడా ఖర్చు చేశారో తెలియని పరిస్దితి

**అస్తవ్యస్తంగా పనులు**

ద్వారకా తిరుమల మండలంలోని ఇరిగేషన్ కాలువ ఊరిలోని ప్రధాన వీధుల్లోంచి వెళుతోంది.కాలువలను శు భ్రం చేయక పోవడంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి.కాలువల సమీపంలోని ట్యాంకు ద్వారానే గ్రామానికి తాగునీరు సరఫరా అవుతుంది.కాలువల్లో మురుగు పేరుకు పోవడంతో దుర్వాసన వెదజతోందని స్దానికులు వాపోతున్నారు.మండలంలోని ఐ.ఎస్.జగన్నాధపురం,ఐ.ఎస్ రాఘవాపురం,జాజుల కుంట,మారంపల్లి,రామన్నగూడెం,సత్తాల,వేంపాడు,వెంకటకృష్ణాపురం,కొత్తపల్లి గ్రామల్లో పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి.పేరుకే ఎం.నాగులాపల్లి మేజర్ పంచాయితీ రద్దీగా ఉండే ప్రదేశాల్లో మురుగు పారుతున్నా కాలువలు శుభ్రం చేయడం లేదు.కాలువలు శుబ్రం చేసినా పూడికను తొలగించడం లేదు.మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది.

## జూన్ 1న జిల్లాలో 2.21 లక్షల మందికి రూ.96.77 కోట్ల సామాజిక పింఛన్ల పంపిణీ

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**పెన్ పవర్, భీమవరం: మే 31**

పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా జూన్ 1వ తేదీన విస్తృత స్థాయిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కింద జిల్లావ్యాప్తంగా 25 రకాల పింఛన్లకు సంబంధించిన మొత్తం 2,21,359 మంది లబ్ధిదారులకు రూ.96,77,38,500 విలువైన పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆమె వెల్లడించారు.

ప్రతి నెల మాదిరిగానే ఈసారి కూడా పింఛన్లను లబ్ధిదారులకు సకాలంలో అందించేందుకు స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జూన్ 1వ తేదీ ఉదయం నుంచే సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నేరుగా పింఛన్లు అందజేయాలని స్పష్టం చేశారు.

జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పంపిణీ ప్రక్రియలో పారదర్శకత, సమర్థత పాటించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గౌరవప్రదంగా సేవలు అందించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, మర్యాదపూర్వకంగా పింఛన్లు అందజేయాలని కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు. పంపిణీ సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అర్హులైన లబ్ధిదారునికి పింఛన్ సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నియోజకవర్గాల వారీగా పింఛన్ల పంపిణీ

ఆచంట నియోజకవర్గం -- 28,230 మంది లబ్ధిదారులకు రూ.12,31,59,500

భీమవరం నియోజకవర్గం -- 30,075 మందికి రూ.13,18,72,500

నరసాపురం నియోజకవర్గం -- 26,600 మందికి రూ.11,50,59,000

పాలకొల్లు నియోజకవర్గం -- 28,584 మందికి రూ.12,47,94,500

తాడేపల్లిగూడెం నియోజకవర్గం -- 30,378 మందికి రూ.13,41,32,500

తణుకు నియోజకవర్గం -- 34,867 మందికి రూ.15,25,43,000

ఉండి నియోజకవర్గం -- 34,227 మందికి రూ.14,86,19,500

గణపవరం మండలం -- 8,398 మందికి రూ.3,75,58,000

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు.

# అంకంపాలెం లో అపరిశుభ్రత





**జీలుగుమిల్లి ,పెన్ పవర్, మే 31;** పి అంకంపాలెం గ్రామం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. మురుగునీరు నిల్వ ఉండి ఈగలు, దోమలు చేరి దుర్వాసన వస్తోంది. గ్రామంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు, మురుగునీరు దర్శనమిస్తోంది. జాతీయ రహదారి అయిన 365 బి బి ఈ గ్రామం గుండా వెళుతుంది. అరహదారి అనుకొని మురుగునీరు నిల్వ ఉండి చెరువు ను తలపిస్తోంది. గ్రామంలోకి వెళ్లాలంటే మురుగునీటిలోనుండే వెళ్లాల్సిందే. ఆ మురిగి నీటిలో నుండి చిన్న పిల్లలు, పెద్దలు వెళ్లడం వలన వ్యాధులు బారిన పడే అవకాశం ఉంది. వేసవికాలంలోనే ఇలా మురుగనీరు నిల్వ ఉంటే వర్షాకాలంలో పరిస్థితి ఏంటి అని గ్రామస్తులు అయోమయానికి గురవుతున్నారు. ఇకనైనా అధికారులు మురుగు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అంకంపాలెం గ్రామంలోకి ప్రవేశించగానే కొన్ని సంవత్సరాల నుండి కోళ్ల ఫారం నుండి దుర్వాసన వస్తూ ఉంటుంది. అయినా గాని పట్టించుకునే నాధుడు లేడని అంకంపాలెం, నిర్వాసిత గ్రామమైన చీడూరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .గ్రామాల పరిశుభ్రతకు ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపట్టిన గాని ఫలితం ఉండడం లేదని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మురుగునీరు కనబడలేదా ?

✷ తిరుమలంపాలెం గ్రామంలో నెల రోజులుగా సమస్య





**ఏలూరు మే 31 పెన్‌పవర్ :** ద్వారకాతిరుమల మండలం తిరుమలం పాలెం అధికారుల నిర్లక్ష్యం గ్రామప్రజల పాలిట శాపంగా మారింది.గ్రామంలోని ప్రధాన రహదారిపైన, తూర్పువీధి,ఎస్సీ కాలనీలలో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. గ్రామంలోని కాలువల్లో మురుగు పేరుకు పోయి దుర్వాసన వెలువడుతోందని గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు.ప్రతి మూడు నెలలకోమారు డివిజనల్ పంచాయితీ అధికారి,ప్రతి ఆరు నెలలకోసారి జిల్లా పంచాయితీ అధికారి,మండల పర్యవేక్షణాధికారి గ్రామాలలో పర్యటించి పారిశుధ్యం,తాగునీరు,పంచాయితీ కార్యాలయం ఉద్యోగుల పనితీరును పర్యవేక్షించాల్సి ఉన్నా ఆధికారుల పర్యటనలు లేక గ్రామంలో పారిశుధ్య సమస్యలు తాండవం చేస్తున్నాయని గ్రామస్తుల నుండి విమర్శలు వ్యక్తమౌతున్నాయి.గ్రామంలోని తూర్పు వీధి,ఎస్సీ కాలువల పరిస్దితి అధ్వానంగా మారింది.కాలనీల్లో కాలువలన్నీ మురుగు నీటితో కనిపిస్తున్నాయి.తద్వారా దుర్వాసన వస్తోంది.మురుగు సమస్య కారణంగా ఇళ్లలో ఉండలేక పోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యను పలు మార్లు పంచాయితీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని స్దానికులు పేర్కోన్నారు.పంచాయితీ కార్యాలయానికి కూతవేటు దూరంలో దాదాపు నెలరోజులుగా అధికారుల కంటపడక పోవడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.నిధుల లేమి సాకుతో వర్షాకాలంలో మురుగునీటిని రోడ్లపై వదిలివేయడంతో ఇళ్ల నుండి రోడ్లపైకి వచ్చే గ్రామ ప్రజల కాళ్లకు ఇన్‌ఫెక్షన్లు సోకుతున్నాయని తెలిపారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com